# ముల్లు



ఆంధ్రప్రభ, జనవరి 1993

పని ముగించుకుని బాల్కనీలో కొచ్చి నిలబడ్డాను. పేరే గానీ పెద్దగా పనంటూ ఏమీ ఉండదు. రమేష్ బ్యాంకులో మేనేజరుగా చేస్తున్నాడు. బాంకు వాళ్ళిచ్చిన అధునాతనమైన క్వార్టరు. ఇంట్లో సమస్తమైన సామగ్రీ ఉన్నాయి. పొద్దున్న తొమ్మిదిన్నర దాకానే హడావిడి. వంట చెయ్యడం, పిల్లల్ని స్కూలుకి పంపించడం, రమేష్‌ని బాంకుకి పంపడం, అంతటితో సరి! మళ్లీ నాలుగున్నరకి పిల్లల రాకతో ఆగిపోయిన నా దినచర్య తిరిగి వేగం పుంజుకుంటుంది.

రమేష్ కాలం విలువ తెలిసిన మనిషి. బాగా 'ప్రాక్టికల్'. ఇంట్లో ఉన్నంతసేపూ అపనీ ఈ పనీ సాయం చేస్తూనే ఉంటారు. ముఖ్యంగా పిల్లల తగాదాలు తీర్చి, వాళ్లకి కావల్సిన పెన్సిళ్లు, రబ్బర్లు లాంటి వస్తువులు ఇవ్వడం అతని డ్యూటీ. వాళ్లు కూడా ఏం కావల్సినా నాన్నని పిలుస్తారే తప్ప అమ్మని పిలవరు.

రమేష్‌కి భేషజాలు కూడా ఏమీ లేవు. జీతం తీసుకొచ్చి నా చేతికే ఇస్తాడు. ఎలా ఖర్చు చేసినా అదేమని ప్రశ్నించడు. "నీకు మాత్రం బాధ్యత తెలీదా?" అనేస్తాడు తేలిగ్గా.

నిజమే! అతనంత కష్టపడి సంపాదించుకొస్తే దాన్ని జాగ్రత్త చెయ్యడం కూడా నాకు రాకపోతే ఎలా? కానీ వాస్తవానికి ఇది చాలా గురుతరమైన బాధ్యత. సంపాదించే వాళ్లకి డబ్బు విలువ తెలిసినంతగా ఇంట్లో కూర్చునే నాలాంటి వాళ్లకి తెలీదు. అతని ముందు దించిన తల యెత్తుకోలేని పనులు చాలా చేశాను.

ఒకసారి చీరలకి మేచింగ్ బ్లౌజ్‌లు తీసుకుందామని తెలిసిన షాపుకెళ్లాను.

"చందేరి జరీ చీరలు కొత్త స్టాకొచ్చాయి మేడమ్!" అని వద్దంటున్నా పడేశాడు షాపతను. నా పట్టు సడలి పోయింది. కళ్లు చెదరగొట్టేలా ఉన్నాయి ఆ చీరలు, రంగులు! వదల బుద్ధి కాలేదు. ఆరేడు వందల ఖరీదులో మూడు చీరలు తీసుకుని బిల్లు ఇంటికి పంపించమని చక్కావచ్చాను.

ఆ తర్వాత నాకే తప్పు చేసినట్లు అనిపించింది. రమేష్‌కేసి సూటిగా చూడలేక పోయాను. అతను నన్ను నమ్మి ఇంటి పెత్తనం చేతిలో పెడితే ఇలా చేశానేమిటి? నాలో నేను మధనపడి పోయాను.

అతను మాత్రం చాలా తేలికగా తీసుకున్నాడు.

"ఎంతో మనసుపడి కొనుక్కున్న చీరలు గూర్చి ఇలా మధనపడతావేంటి గీతా? రెండు వేలు మనకేమంత పెద్ద మొత్తం కాదు. నా జీతం సగం." అనేశాడు తేలిగ్గా. ఆ తర్వాత అతనన్నమాటలు నన్ను కదిల్చాయి.

"నువ్వు సంతోషంగా ఉంటే చాలు నాకు ఎంతేనా ఖర్చు పెడతాను. పెళ్ళికి ముందు... నువ్వు, నేను, వింధ్య కలిసి తిరిగే రోజుల్లో చాలా చురుకుగా ఉండే దానివి. అదంతా

ఏమైపోయింది? ఎందుకు నీలో ఇంత మార్పు ఎనీతింగ్ రాంగ్ విత్ మీ? ఎన్నో సార్లు నిన్నీమాట అడగాలని అనుకుని కూడా అడగడం మానేశాను."

అతను నా సమాధానం ఆశించలేదు. ప్రశ్నలు వేసి నాలో నేను ఆలోచించుకునేలా చేసి అక్కణ్ణుంచి వెళ్ళి పోయాడు.

ఎంత సంస్కారం! ఎంత ఔన్నత్యం!

నాకా వ్యక్తిని భర్తగా పొందినందుకు సంతోషం వెయ్యడం లేదు. మనసు మూలల్ని ముల్లు కెలుకుతున్నట్టు బాధ వేస్తోంది. నాది కాని జీవితం, ఎవరికో చెందాల్సిన ఔన్నత్యం నేనుభవిస్తున్నాననిపిస్తుంది. అతనికి మాత్రం తెలీదా, నా ఆవేదనేమిటో? బహుశః అతని ఊహకి కూడా అందదేమో! నాలాగా ఆలోచించ గలిగే వ్యక్తే అయితే నా భర్తయి ఉండేవాడే కాదు.

ఇలాంటి ఆలోచనలతో నా మనసు చచ్చుబడిపోయింది. శరీరంలో ఓ భాగం అలా పనిచెయ్యకపోయినా మనుగడ సాగించవచ్చు గానీ మనసు చచ్చుబడితే బ్రతకడం చాలా కష్టం. రెండు సార్లు ఈ డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించి వెంట్రుక వాసిలో బయటపడ్డాను.

"శరీరంలో జరిగే జీవరసాయన చర్య కారణంగా పుట్టుకొచ్చే వ్యర్థ పదార్థం మనసనేది. దాన్ని తీసవతల పారెయ్యాలి. లేకపోతే బ్రతకడం కష్టం". అంటుంది వింధ్య.

"ఔన్నిజమే!" అని ఏకీభవిస్తాడు రమేష్ నేను మాత్రం ఆ నిజాన్నొప్పుకోలేను.

నిజంగానే వింధ్యకి మనసనేది లేదు. ఉంటే ఇంత ధీమాగా బ్రతికెయ్యలేదు. అదీ హాయిగా ఉంది. రమేష్ హాయిగానే ఉన్నాడు. ఇద్దరి మధ్య నలిగిపోతున్నది నేనే.

పదేళ్ల క్రితం వింధ్య జీవితంలో అడుగుపెట్టబోయి నా బ్రతుకు బాటలోకి నడిచొచ్చాడు రమేష్. లోకం దృష్టిలో చాలా తేలికగా జరిగిపోయిందా సంఘటన. నాకు మాత్రం అదే పెను తుఫాను.

***

మేం ఐదుగురు అక్క చెల్లెళ్లం. అందరి తర్వాత ఒక తమ్ముడు. పెద్ద వాళ్లిద్దరి పెళ్లిళ్ళైపోయాయి. వింధ్య, తర్వాత నేను పెళ్లికున్నాము. మా ఇద్దరికీ రెండేళ్ల తేడా. తను బ్యాంకులో క్లర్కుగా చేస్తుండేది. నేను బి.ఎస్.సి. పూర్తి చేసి ఖాళీగా ఉన్నాను .ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఎమ్మెస్సీ చదువుతానంటే నాన్నగారొప్పుకోలేదు.

నాకూ వింధ్యకీ కలిపి సంబంధాలు చూసేవారు.

కట్నం తక్కువడిగి, ఉద్యోగం చేస్తున్న పిల్ల కావాలంటే వింధ్యని చూపించేవారు. డబ్బాశ ఎక్కువగా ఉన్న వాళ్లకి నన్ను చూపించేవారు. డబ్బు గుప్పించడానికి మా దగ్గర పెద్దగా ఏమీ లేదు. అక్కల పెళ్లిళ్లకైన అప్పులు ఇప్పటి దాకా తీర్చారు నాన్న. ఇప్పుడు మా పెళ్లిళ్లకి కొత్త అప్పులు చెయ్యాలి. కొంత వరకూ వింధ్య పరిస్థితి నయం. దాని జీతంలో కొంత దాని పేర్నవేసేవారు నాన్న. పెళ్లంటూ కుదిరితే బ్యాంకువాళ్ళు అప్పు ఇస్తార్ట. నా పరిస్థితి హీనం. నా రూపం చూసి చేసుకోవాలి. రెండు తెప్పల మీది ప్రయాణంలా ఏ సంబంధమూ కుదిరేది కాదు. ఈ తతంగం నాకు చాలా అసహ్యం వేసేది. 'ఎప్పటికి విముక్తి దొరుకుతుందా!' అని ఎదురు చూసేదాన్ని.

ఒకసారి రాజమండ్రి నుంచీ నన్ను చూసుకోవడానికి పెళ్లి వారొచ్చారు. తీరా ఇంటికొచ్చాక మడత పేజీ పెట్టుకూర్చున్నారు. "ఇద్దర్నీ చూపించండి. ఎవరు నచ్చితే వాళ్లని చేసుకుంటాం."

ఉక్రోషంతో నా గుండె రగిలిపోయింది. "ఇదేమైనా గొర్రెల బేరమా? ఇద్దర్నీ కూర్చోబెట్టే

ఎంచుకోవడానికి? ముప్పైవేల కట్నం కావాలనుకుని వచ్చారు. నచ్చితే నన్ను చేసుకోమనండి. లేకపోతే వచ్చిన దార్ని పొమ్మనండి. అంతేగానీ ఇదేమిటి? ఇలాంటి ఈడియట్స్‌ని ఇంటికి తీసుకొస్తే నేను ఇల్లొదిలేసి ఏ అనాధాశ్రమానికో పారిపోతాను" ఏడుస్తూ నాన్నతో పోట్లాడాను.

నాన్న చాలా బాధపడ్డారు. "మిమ్మల్ని కన్నప్పుడు నేనేమీ బాధ పడలేదమ్మా. అడ్డమైన వాళ్ళ గడ్డాలూ పుచ్చుకుని 'మారత్న మాణిక్యాలని మీరు స్వీకరించడయ్యా!' అని అర్థిస్తూ బాధపడుతున్నాను. గీతా! పెళ్లంటూ అయితే మొగుణ్ణి ముప్పతిప్పలు పెట్టి నీ క్షోభకి బదులు తీర్చుకుందువుగాని. వచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దు." అని బ్రతిమాలారు.

ఆ సంబంధం కూడా మా ఇద్దర్లో ఎవరికీ కుదర్లేదు వింధ్యకి ముప్పైవేలిస్తే చేసుకుంటామన్నారు. పైగా మేమే డబ్బు మనుషులం అన్నట్టు మాట్లాడాడు మధ్యవర్తి "మీరిలా వింధ్యకి కట్నం ఇవ్వను. గీతకే ఇస్తాను అని భీష్మించుకుని కూర్చుంటే కుదరదు రావుగారూ! ముప్పై వేలంటే ఎంత? ఆ పిల్ల ఏడాది సంపాదించినంత. నాలుగేళ్లనించీ ఉద్యోగం చేస్తోంది ఆ లెక్కలన్నీ వాళ్లడిగారా? పిల్ల సంపాదిస్తే వాళ్లకేమైనా ఒరుగుతుందా? మీరిచ్చే కట్నమే కదా, మిగులు?" అన్నాడు .

"మాకేం పాతికలు మించిపోయాయా నాన్నా? కొన్నాళ్ళసలు సంబంధాలు చూడకండి. రాతుంటే వాళ్ళే మమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు." వింధ్య కూడా బాగా గాయపడింది.

మధ్య తరగతి సంసారాల తీరే అంత. ఎప్పుడూ సర్దుకు పోవడమో, త్యాగమో తప్పదు. ఇరవై నాలుగేళ్ళ వయసున్న వింధ్య, దాని కన్నా రెండేళ్ళు చిన్నదాన్నయిన నేను - మా కింకా పెళ్లీడు రాలేదని మభ్య పెట్టుకుంటూ తిరగాలి. ఏ వయసు కాముచ్చట కావాలనుకుంటే కాసులు గుమ్మరించక తప్పదు. అవా మా దగ్గిర లేవు.

ఆర్నెల్ల కాలం గతంలోకి జారుకుంది.

రమేష్‌ని తీసుకొచ్చి పరిచయం చేసింది. "మా కొలిగ్ నాన్నగారూ! మన వాళ్లే - నియోగులు!"

ఆ పరిచయం చెయ్యడమే తమాషాగా ఉంది.

"మీ కభ్యంతరం లేకపోతే నేనూ, రమేష్ పనెల్లి చేసుకుంటాం. అతనికి కట్నం అక్కర్లేదట. అతనికో చెల్లుంది. ఆమెకి పదహారేళ్లు. మరో రెండు మూడేళ్లలో ఆమెకి చేసేశాక మా లైన్ క్లియరౌతుంది". ఇంకో సందర్భంలో చెప్పింది.

అమ్మ, నాన్న చాలా సంతోషించారు.

"కట్నం వద్దన్నాడని నీ కేం అన్యాయం చెయ్యను వింధ్యా! భీమారంలో ఉన్న ప్లాటు నీ పేర రాస్తాను. వెంటనే ఇల్లు కట్టుకుందురు గాని" అన్నారు నాన్న.

"నా గురించి మీరు బాధపడవద్దు. ఇంకో పదివేలు ఎక్కువిచ్చైనా సరే, గీతక్కూడా కుదర్చండి." అంది ఆరిందాలా.

నేను వింధ్యను మనస్ఫూర్తిగా అభినందించాను. రమేష్‌ని మనసులోనే ప్రశంసించాను.

రమేష్ తరుచుగా మా ఇంటికొచ్చే వాడు. నాతో కూడా సరదాగా ఉండేవాడు. ఔచిత్యపు హద్దులు దాటని చనువతనిది. మొదట్లో వాళ్లిద్దరి మధ్యకి వెళ్లడానికి ఇబ్బందిగా అనిపించేది. రాను రాను అలవాటైపోయింది.

ముగ్గురం కలిసి సినిమాలకి వెళ్ళేవాళ్లం. ఫ్రెండ్స్‌లానే తప్పించి కాబోయే భార్యా భర్తల్లా ప్రవర్తించే వారు కాదు వాళ్లిద్దరూ.

రమేష్ చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాడు. ఎనిమిది మంది సభ్యులున్న కుటుంబానికి ఆధారం

ఇతను. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తాతగారు, నాయనమ్మ, తనకన్నా ఆరేళ్లు చిన్నవాడైన వాళ్ల కొడుకు, తల్లి, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు - అంతా అతని మీద ఆధారపడ్డ వాళ్లే తప్పి అతని భారం మోసేవాళ్లు లేరు. అందువల్లనే అతనింత 'మెటీరియలిస్టుగా' తయారయ్యాడేమోననిపిస్తుంది. ఏమైనా మానవ జీవితంలోని విలువలు బాగా తెలిసిన వ్యక్తి.

మొదట్లో వింధ్య అన్నట్టుగానే పద్దెనిమిదేళ్ళు రాగానే రమేష్ తన చెల్లెలికి సంబంధాలు చూడడం మొదలుపెట్టాడు. వెంటనే కుదిరి పోయింది. ఇతను నలభైవేలిస్తానన్నాడట. వాళ్లు యాభై అడిగారు. పెద్దమీమాంసలేవీ పడకుండా వాళ్ళడిగినంతా యిచ్చేసి క్లుప్తంగా పెళ్ళికానిచ్చేసాడు. ఈ సందర్భంలో వింధ్య దగ్గర్నుంచీ ఇరవై వేలు తీసుకున్నాడు - అప్పుగానే!

"జీవితంలో ఒక్కసారి జరిగేది పెళ్లి. దాన్ని వేడుగ్గా జరుపుకోవాలని పెళ్లి కొడుక్కుండాలి. అతనికి కట్నమే ముఖ్యమైతే మనమేం చెయ్యగలం?" అనేశాడు సింపుల్‌గా.

"మహా లౌకికుడు!" అన్నారు నాన్న. పెళ్ళైనా కాకుండా వింధ్య దగ్గర్నుంచీ రమేష్ ఇరవై వేలు తీసుకున్నాడని ఆయనకి కినుకగా ఉంది. భలే మనుషులు!

రమేష్, వింధ్యల పెళ్లికి గ్రీన్ సిగ్నల్ వచ్చేసినట్టే!

"ముహూర్తాలెప్పుడు పెట్టించను?" అడిగారు నాన్న.

"మీ ఇష్టం." నవ్వి చెప్పాడు రమేష్. "మా పెద్దవాళ్లని ఓసారి కలవండి." అన్నాడు.

ఆపై ఆదివారం తిథి, నక్షత్రం చూసి రమేష్ వాళ్ల ఇంటికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు అమ్మ, నాన్న.

"గీతక్కూడా కుదిరితే బావుండేది." వింధ్య గొణుగుతూనే ఉంది.

"మనిద్దరం కలిసి మీ చెల్లెలికి చూద్దాం." అన్నాడు రమేష్.

ఎదరు చూసిన ఆదివారం మేం అనుకున్న విధంగా రాలేదు. మా జీవితాల్ని తారుమారు చేస్తూ, మా గమ్యాలని మార్చేస్తూ వచ్చింది. ఆ రోజు ఉదయాన్నే పేపరు కోసమని లైబ్రరీ కెళ్ళిన నాన్నగారు ఏక్సిడెంట్లోచనిపోయారు. ఇది విధి మా మీద చేసిన మెరుపు దాడి.

నా పెళ్ళికని కూడబెట్టిన కొంత మొత్తం తప్పించి వేరు పైసలేదు. నాల్గు వేళ్ళు లోపలికి పోవడమే గగనమయ్యే మాలాంటి కుటుంబాల్లో పెద్దగా దాపరికాలే ముంటాయి? పైసాపైసా కూడబెట్టి దాచినదేదో అల్లుళ్లకి ధారపోశారు. ఒకటి రెండు ఇన్స్యూరెన్సు పాలసీలు తీసుకుని వాటిని కట్టలేక మధ్యలో ఆపేశారు. నాన్నగారు ఆయన చేసేది ప్రైవేటు కాలేజీలో కావటం చేత యాజమాన్యం నించీ సానుభూతే తప్ప ఇంకేమీ రాలేదు.

"ఈ వేళ చనిపోతే రేపటికి రెండో రోజు." అన్నారెవరో. రోజులు గడిచిపోతున్నాయి. అంతా అగమ్యగోచరం. ఓ వైపు పెళ్లి, ఉద్యోగం లేకుండా నేను. మరోవైపు అమ్మ, పదహారేళ్ళ చెల్లి, పద్నాలుగేళ్ల తమ్ముడు కుటుంబ భారం అనివార్యంగా వింధ్య మీద పడింది. రమేష్ వచ్చి వెళ్తునే ఉన్నాడు.

"నువ్వు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవే వింధ్యా! ఈ ఊబిలో కూరుకుపోతే పైకి లాగడానికి చెయ్యందించే వాళ్లుండరు. గీతక్కూడా ఒకటి చూడంటే ఉన్నదేదో పెట్టి చేసేస్తాను. ఏడుస్తూ అంది అమ్మ.

"నా స్వార్థం నేను చూసుకుంటే మీరంతా ఏమైపోతారే?" అయోమయంగా అంది వింధ్య.

"మారాతెలా ఉంటే అలానే జరుగుతుంది. నువ్వేనా సుఖంగా ఉంటావు. అందులోనూ చేతికి అంది వచ్చిన సంబంధం." మొండిగా అంది అమ్మ.

ఎటూ మాట్లాడలేని పరిస్థితిలో నేనున్నాను. నాది ఏ దార్లోనూ పరిష్కృతం చెయ్యలేని

సమస్య. ఉన్న డబ్బుతో పెళ్లి చేసుకుని వెళ్లిపోతే అమ్మా వాళ్ళూ నిరాధారంగా మిగిలిపోతారు. పెళ్లొద్దంటే వింధ్య నెత్తిని గుదిబండలా తయారౌతాను ఏడుపొచ్చింది నాకు. మా కో గమ్యం నిర్దేశించి నాన్న వెళ్లి పోయింటే ఎంత బాగుండేది! నాలో నేను ఏడ్చాను.

నాలుగు రోజులు గడిచాయి.

"పార్కుకెళ్దాం రావే!" అని బయల్దేరేసింది. జనసమ్మర్దం లేని చోట కూర్చున్నాం.

"రమేష్ నిన్ను చేసుకుంటానన్నాడు". ఉపోద్ఘాతమేమీ లేకుండా సూటిగా అనేసింది. నా చెవుల్ని నేనే నమ్మలేక పోయాను.

"ఏమిటక్కా నువ్వనేది?" కంగారుగా అడిగాను.

"ఆలోచించు గీతా! రమేష్ తనంతట తానుగా ఇలా ప్రపోజ్ చేశాడు. మంచివాడు గాబట్టి ఇంకా మన కోసం ప్రాకులాడుతున్నాడు. వేరే ఎవరైనా ఐతే ఈపాటికి ముఖం చాటేసేవారు. "ఊపిరి తీసుకోవడానికి ఆగింది. నేను కలగజేసుకోబోయాను. నన్నాపి తనే కొనసాగించింది.

"అతని కోణంలోంచీ ఆలోచించు. నేనా బాధ్యతలన్నీ వదులుకుని నా దానిని పోలేను. అతన్ని నా కోసం ఎంత కాలం ఆగమంటావు. అప్పుడే అతనికి ముప్పై రెండు. నువ్వు కాదంటే మరో పిల్లని చూసుకుంటాడు."

"అదేమిటే అక్కా! అతనూ నువ్వూ ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకుందామనుకున్నారు" నా నోట్లోంచీ మాటలు పెగలలేదు.

నీ మొహం. కులం, గోత్రం చూసి చేసుకునేది ప్రేమేమిటి? అతను వుద్యోగస్థుడు సాటి కులంవాడు. కట్నం ఆశలేదు. అవినాకు ప్లస్‌పాయింట్స్, నేనూ వుద్యోగం చేస్తున్నాను. బాదరబందీల్లేవు. అవతనికి ప్లస్ పాయింట్సు. ఒక అవగాహనకి వచ్చి యిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. ఇన్ని ఆలోచించి తీసుకున్న నిర్ణయం ప్రేమెలాగౌతుంది?" అడిగింది వింధ్య.

దాని గొంతులో ఏ కోణం లోంచో వినిపించిన దుఃఖపు జీర నా కర్ణపుటాలని తాకకపోలేదు. ఎందుకా బాధ? మనసు వంచించుకుంటున్నందుకా? లేక కలల సౌధం కూలిపోతున్నందుకా?

"నీ జీతం కోసం నిన్ను చేసుకోవాలనుకున్నాడు ఏం చూసి నన్ను చేసుకుంటాడే? ఉద్యోగం లేని నన్ను చేసుకున్నా బాధ్యతల్తో నిన్ను చేసుకున్నా ఒకటే!"

"అతని పరంగా ఆలోచించు గీతా! అయిదేళ్ల వయసులో తండ్రిని పోగొట్టుకుని అప్పట్నించీ బాధ్యతల్ని తీర్చుకోవడమే ధ్యేయంగా పెరిగిన రమేష్ ఈ కొత్త బాధ్యతల్ని తలకెత్తుకోవడానికి సిద్ధంగా లేడు. అలాగని అతనికి 'మోరల్స్' లేవనుకోకు. నా జీతం కన్నా అతనికి ముఖ్యమైనది నిశ్చింతయిన జీవితం. అతని భాషలో చెప్పాలంటే పెళ్లనేది సామాజిక శారీరక అవసరం! దాని కోసం అనవసర బాధ్యతల్ని తలకెత్తుకునే పురుషుడుండడు." [illegible] సమర్థిస్తూ అంది వింధ్య.

"చీకటి పడింది. వెళ్దాం పద." ఇంక ఆ విషయం చర్చించడం ఇష్టంలేక లేచి నిల్చున్నాను. వింధ్య మౌనంగా నన్ననుసరించింది.

వారం రోజులపాటు ఇంట్లో మౌనం విలయతాండవం చేసింది. నేను, వింధ్య తప్పించుకు తిరిగాము. ఎనిమిదో రోజుని అమ్మే నన్నడిగింది.

"వింధ్య నిన్నేదో అడుగుతానందే!" అని.

అంటే అమ్మకి అంతా తెలుసనన్నమాట! ఏం చెప్పాలో తెలీక మౌనం వహించాను.

నా మౌనాన్నాధారంగా తీసుకుని అమ్మ చెప్పసాగింది. "అతనా దాన్ని చేసుకోవడానికి సిద్ధంగా లేడు. నిన్ను చేసుకోవడానికి సుముఖత చూపించాడు. నువ్వేనా, వింధ్యేనా నాకొక్కటే. అది చెప్పి మార్గం బావుంది. దాని దారిన అది పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే మన సంసారం బజారున పడుతుంది. ఇలాగైతే నీ బారం తీరుతుంది. ఇంక మిగిలేది చెల్లీ, తమ్ముడు. కాస్త నిలదొక్కుకుని చెల్లిక్కూడా చేసేస్తే ఈలోగా వాడు అందొస్తాడు. అప్పుడిక దాని బాధ్యతలు తీరి పోతాయి. నాన్నగారి స్థానంలో నిలబడి ఈ ఇంటి భారం మోస్తోందిగాబట్టి దానికి ఎదురు చెప్పకు." అంది.

నేను అక్కణ్ణుంచీ వెళ్లిపోయాను. రమేష్‌ని చేసుకోవడం నాకెంత మాత్రం ఇష్టం లేదు. నా మాటెవరు వింటారు?

దాని జీవితం నాశనం కాకూడదు అమ్మకి. దాన్ని తిరస్కరించినందుకు చెడ్డపేరు రాకూడదు రమేష్‌కి.

అతని సామాజిక - శారీరకావసరాలు తీర్చడానికి వింధ్యో, గీతో మరో రమో ఎవరో ఒక ఆడపిల్ల కావాలి. అతని స్టేటస్‌కి సింబల్ కావాలి. నాకంటూ ఓ మనసుందని ప్రకటించుకోలేని అస్వతంత్రురాలిని.నాన్న నాకిస్తానన్న కట్నం చూసో, నా అందం చూసో నన్ను నా కోసమే స్వీకరించే మగాడు కావాలి. వింధ్యని, మరో సంధ్యనీ ఒకేలా చూసే వ్యక్తి కాదు.

నేను ఔననికాదనకుండానే నా వివాహం జరిగిపోయింది. అంతా అతను నన్ను ప్రేమించి చేసుకున్నాడనే అనుకున్నారు.

ఈ వేళ చనిపోతే రేపటికి రెండో రోజు. ఎంత నిజం! నేను మానసికంగా చనిపోయిన రోజు నిన్నగానూ, మొన్నగానూ, పదేళ్ల వెనక్కి జారుకుంది. ఇద్దరు పిల్లల తల్లినయ్యాను. అంత జరిగినా, నాకు రమేష్ పట్ల అనురక్తి మాత్రం పుట్టలేదు. అతను 'గీతా'! అని పిలిచినా 'వింధ్యా'! అంటున్నట్టే ఉంటుంది నాకు.

వింధ్య కూడా పెళ్లి చేసుకుంది. ముప్పై ఐదేళ్ళకి బాధ్యతల్ని తీర్చుకుని నలభైయేళ్ల లెక్చరర్ని చేసుకుంది. ఇద్దరు పిల్లలు వాళ్లకి. వెయ్యేసి రూపాయల చీరలు కడుతుంది. ఈ వేళో రేపో కారు కూడా కొంటారట.

రమేష్, వింధ్యా కలుసుకుంటే ఇవే కబుర్లు. ఎవరెంత సంపాదించినదీ.

ఎవరెంత దాచినదీ...

తోడల్లుళ్లిద్దరూ కలుసుకున్నా అంతే!

ఎటూ....

ఎవర్లోనూ కలవలేనిది నేనే!

కనిపించని ముల్లేదో నా వ్యక్తిత్వాన్ని కెలుకుతూ ఉంటుంది.

ఎన్నున్నా ఏదో వెలితి!

★★★

ఏమిటండీ, మిసెస్ రమేష్ గారూ! అలా నిలబడే ఆలోచనల్లోకి జారుకున్నారు?" పక్క క్వార్టర్లోంచి పలకరింపు విని ఈ లోకంలో కొచ్చాను.

"అబ్బే! ఏమీ లేదండీ!" నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

"మీ పెళ్లిరోజు గుర్తొచ్చిందేమో! అదిగో... మీ చెంపలు ఎర్రపడుతున్నాయి! ఇద్దరు పిల్లల తల్లయ్యుండీ ఇంత 'స్మార్ట్'గా ఎలా ఉండగలరండీ బాబూ? మీది లవ్‌మేరేజటగా.... మీ కటాక్షం కోసం నాలుగేళ్లు తపస్సు చేశార్టగదా రమేష్‌గారు? ఆ మధ్యనోసారి మాటల్లో మా 'హబ్బీ' చెప్పారు..... ఎంత అదృష్టవంతులండీ మీరు!" ఆవిడ పరిహాసిస్తోంటే ఆ ముల్లులాంటి బాధ మళ్లీ మొదలైంది.